క్లుప్తంగా

మర్యాదపూర్వక కలయిక



పార్టీ అధినేత జగన్‌కు కృతజ్ఞతలు తెలిపిన జాషువ

భీమవరం: తాడేపల్లిలోని వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో పార్టీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని పార్టీ ఇంటెలెక్చువల్స్ ఫోరం (స్పోక్స్ పర్సన్) రాష్ట్ర అధికార ప్రతినిధి ఈద జాషువ మర్యాదపూర్వకంగా కలిశారు. తనను రాష్ట్ర అధికార ప్రతినిధిగా నియమించినందుకు కృతజ్ఞతలు తెలిపారు.

వైఎస్ జగన్‌ను కలిసిన నగర పంచాయతీ విప్



మాజీ సీఎం జగన్ మోహన్‌రెడ్డిని కలిసిన నగర పంచాయతీ విప్ పడాల శ్రీనివాసరెడ్డి

ఆకివీడు: వైఎస్సార్‌సీపీ అధినేత, మాజీ సీఎం, వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని నగర పంచాయతీ విప్ పడాల శ్రీనివాసరెడ్డి మర్యాదపూర్వకంగా కలిశారు. జగన్ కార్యాలయంలో బుధవారం కలిసినట్లు ఆయన చెప్పారు. పార్టీ బలోపేతానికి, ప్రజా సమస్యలపై నిరంతరం పోరాడాలని చెప్పినట్లు శ్రీనివాసరెడ్డి వివరించారు.

హనుమద్ జయంతి ఉత్సవాలకు ఏర్పాట్లు పూర్తి



శ్రీభక్తాంజనేయస్వామి

పాలకోడేరు: ఈ నెల 22న నిర్వహించే హనుమద్ జయంతి ఉత్సవాలకు పెన్నాడ అగ్రహారంలో ఆంజనేయస్వామి ఆలయాన్ని ముస్తాబు చేశారు. ఆలయాల వద్ద పందిళ్లు వేసి, విద్యుత్ దీపాలతో అలంకరించారు. ఉత్సవాల సందర్భంగా పలు భజన బృందాలను, ఆధ్యాత్మిక కార్యక్రమాలను ఏర్పాటు చేశారు. పెన్నాడ అగ్రహారంలో శ్రీభక్త ఆంజనేయస్వామి విగ్రహం వద్ద హనుమద్ జయంతి వేడుకలను పురస్కరించుకొని 24 శనివారం భారీ అన్న సమారాధన నిర్వహించేందుకు ఆలయ కమిటీ సభ్యులు అన్ని ఏర్పాట్లు చేశారు.

క్రికెట్ టోర్నమెంట్ ప్రారంభం

పెనుగొండ: ఆచంట పెదపేట చైతన్య యువజన సంఘం ఆధ్వర్యంలో బుధవారం ఆచంట ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణలో జిల్లా స్థాయి క్రికెట్ పోటీలు ప్రారంభించారు. యువకులు ఉత్సాహంగా క్రికెట్ ఆడారు. కార్యక్రమంలో పితాని వెంకట్, జెడ్పీటీసీ సభ్యుడు ఉప్పలపాటి సురేష్‌బాబు, ఎస్సై వెంకట రమణ, బీరా నరసింహమూర్తి పాల్గొన్నారు.

నేడు తిరంగా యాత్ర

పెనుగొండ: భారత సైన్యం ఆపరేషన్ సిందూర్ విజయవంతం చేసిన సందర్భంగా ఆచంట నియోజకవర్గంలో గురువారం తిరంగా యాత్ర నిర్వహిస్తున్నట్లు ఆచంట శాసనసభ్యుడు పితాని సత్యనారాయణ తెలిపారు. ఈ మేరకు బుధవారం ఆయన క్యాంపు కార్యాలయం నుంచి ఓ ప్రకటన వెలువడింది. మధ్యాహ్నం 3 గంటలకు పెనుమంట్ర మండలం సత్తా రామేశ్వరం నుంచి మార్టేరు మీదుగా ఆచంట, కోడేరు వరకూ బైక్ ర్యాలీ నిర్వహిస్తామని పేర్కొన్నారు. పార్టీలకతీతంగా ప్రజలు పాల్గొనాలని కోరారు.

ఎంబ్రాయిడరీ కోర్సుకు ఉచిత శిక్షణ

పెనుగొండ: ఆచంట ప్రభుత్వ ఐటీఐ, రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంయుక్త ఆధ్వర్యంలో సంప్రదాయ చేతి ఎంబ్రాయిడరీ కోర్సు రెండు నెలల ఉచిత శిక్షణ అందిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ ఐవీ సత్యనారాయణరాజు తెలిపారు. ఈ మేరకు బుధవారం ఆయన ఓ ప్రకటన విడుదల చేశారు. ఆసక్తి ఉన్న యువత ఈ అవకాశాన్ని సద్వినియోగించుకోవాలని పేర్కొన్నారు. ఈ నెల 31లోపు కళాశాలకు వచ్చి వివరాలు నమోదు చేసుకోవాలని సూచించారు. రు. శిక్షణ పూర్తయిన తరువాత కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుంచి గుర్తింపు పొందిన ధ్రువీకరణ పత్రం అందిస్తామని వివరించారు. మరిన్ని వివరాలకు 95735 28272 నంబర్‌కు ఫోన్ చేయాలని కోరారు.

చేనుకు రక్ష.. భూసార పరీక్ష

- మండలంలో 560 మట్టి శ్యాంపిల్స్ సేకరణ
- సస్యరక్షణపై శ్రద్ధ అవసరమంటున్న వ్యవసాయాధికారులు



యనమదుర్రులో భూసార పరీక్షల కోసం మట్టి నమూనాలను సేకరిస్తున్న వ్యవసాయ సిబ్బంది



సంచుల్లో నింపిన మట్టి నమూనాలు

భీమవరం అర్బన్: భూసారం ఎప్పుడూ ఒకేలా ఉండదు. వేసే పంటలు, వాడే క్రిమి సంహారకాలు, ఎరువులను బట్టి మార్పు చెందుతుంది. ఆ మార్పులను ఎప్పటికప్పుడు తెలుసుకొని వ్యవసాయం చేస్తేనే మంచి దిగుబడులు సాధించొచ్చు. రైతులు అనువైన సమయంలో భూసార పరీక్షలు చేయించుకోవడం ఉత్తమమని వ్యవసాయ అధికారులు సూచిస్తున్నారు. భీమవరం మండలంలో యనమదుర్రు, దిరుసుమర్రు, బేతపూడి, తుందుర్రు, రాయలం, చినఅమిరం, కొవ్వాడ అన్నవరం, నరసింహపురం తదితర గ్రామాల్లో సుమారు 7 వేల ఎకరాల్లో వరి సాగు చేస్తున్నారు. ప్రతి ఏటా దాళ్వా సాగు పూర్తి కాగానే భూసార పరీక్షల కోసం మట్టి శ్యాంపిల్స్‌ను వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో సేకరిస్తారు. ఈ ఏడాది మండలంలో 560 మట్టి శ్యాంపిల్స్ సేకరించినట్లు వ్యవసాయాధికారి నిమ్మల శ్రీనివాస్ తెలిపారు. భూసారాన్ని పరిరక్షించేందుకు వేసవిలో దుక్కులు దున్నడం, సేంద్రియ ఎరువులు వేయడం వంటివి చేస్తే భూసారం పెరిగి అధిక దిగుబడి సాధించొచ్చని వ్యవసాయాధికారులు చెబుతున్నారు.

ఇలా చేయాలి

నల్లచౌడు, ఆమ్ల నేలను పీహెచ్ మీటర్ ద్వారా తెలుసుకోవచ్చు. పొలాల్లో రసాయన ఎరువులు ఎక్కువగా వాడడంతో చౌడు శాతం పెరుగుతోంది. దీని నివారణకు సేంద్రియ ఎరువులు ఉపయోగించాలి. జీలుగతో నల్ల చౌడు పోతుంది. ఉప్పు నేలలను తెలుసుకోవడానికి కండెక్టివ్ మీటర్‌ను ఉపయోగిస్తారు. పొలాల్లో తెల్లగా పేరుకుపోయి ఉంటుంది. ఎక్కడైతే ఒక శాతం ఉప్పు కన్నా ఎక్కువ ఉంటే పొలాన్ని బాగా దున్ని ఒక రోజు నీరు నిల్వ చేయాలి. ఆ తరువాత నీటిని బయటకు పంపించాలి.

పైరుపై ఎరువు.. భాస్వర లోపం

నేలలో భాస్వరం ఎంత వరకూ ఉందో తెలుసుకోవడానికి కలోరి మీటర్‌ను ఉపయోగిస్తారు. ప్రధానంగా వరికి 30 బస్తాల వరకు రసాయనిక ఎరువులు ఉపయోగిస్తే అటువంటి నేలలో ఎకరాకు 24 కిలోల కన్నా ఎక్కువ భాస్వరం ఉంటే బాగుంటుందని చెప్పొచ్చు. ఒక వేళ ఎకరాకు 150 కిలోల భాస్వరం కన్నా ఎక్కువ ఉంటే మొక్కకు జింక్, ఇనుము అందకుండా చేస్తాయి. దీంతో పైరు ఎర్రగా మారుతుంది. అటువంటి సమయంలో పైపాటుగా కాంప్లెక్స్, డీఏపీ ఎరువులు వేయకూడదు. ప్రారంభంలో దుక్కిలో కొంత భాస్వరం వేసుకోవచ్చు. పంటలో ఆరుతడి, తడి పైర్లకు ఎకరాకు 50 కిలోల పొటాష్‌ను వాడొచ్చు. వర్షాధారం కింద పొలాల్లో ఎకరాకు 25 కిలోల పొటాష్‌ను ఉపయోగించొచ్చు. భూసార పరీక్షల ద్వారా నేలలో జింక్, ఇనుము, బోరాన్, మాంగనీస్ వంటి వాటితో పాటుగా సూక్ష్మధాతు లోపాలు తెలుసుకొని ఎరువులు వాడొచ్చు.

మట్టి నమూనా సేకరణ ఇలా..

మట్టి నమూనా తీయాల్సిన చోట చెత్తాచెదారం లేకుండా చూడాలి. నాగలు, సాలు పోయే లోతు వరకూ లేదంటే ఆరు అంగుళాల లోతు వరకు వి ఆకారంలో తవ్వాలి. సేకరించిన నమూనాను శుభ్రమైన సంచిపై పోసి కలపాలి. కలిపిన మట్టిలో రాళ్లు, పంట వేర్లు, కొయ్యలు మొదలైన వాటిని తీసి వేయాలి. మట్టి తడిగా ఉంటే నీడలో ఆర బెట్టాలి. కలిపిన మట్టిని నాలుగు భాగాలుగా విడదీయాలి. ఎదురెదురుగా రెండు భాగాలు ఉంచి మిగతావి తీసి వేయాలి. సేకరించిన మట్టిని శుభ్రమైన వస్త్ర సంచి లేకుంటే పాలిథీన్ సంచిలో నింపాలి. ఆ నమూనాను వ్యవసాయాధికారి ద్వారా సమీపంలోని భూసార పరీక్షా కేంద్రానికి పంపాలి.

రైతులకు అవగాహన పెరగాలి



భూసార పరీక్షపై రైతుల్లో అవగాహన పెరగాలి. మట్టి నమూనా పరీక్ష లేకుండా పంటల సాగు చేయరాదు. అలా చేయడం వల్ల సాగులో విచక్షణ రహితంగా ఎరువులు వాడి రైతులు నష్టపోతున్నారు. భూ సార పరీక్షలు వేసవిలో చేస్తాం. భూసార పరీక్షల ద్వారా నేలలో జింక్, ఇనుము, బోరాన్, మాంగనీస్ వంటి వాటితో పాటుగా సూక్ష్మధాతు లోపాలు తెలుసుకుని ఎరువులు వాడవచ్చు. రైతులు ఆ సమయంలో తమ పంట పొలాల్లో పరీక్షలు చేయించుకోవాలి. రైతులకు సాగులో ఖర్చు తగ్గించి అధిక దిగుబడి సాధించేందుకు భూ సార పరీక్షలు ఉచితంగా చేస్తున్నాం.

–నిమ్మల శ్రీనివాస్, మండల వ్యవసాయాధికారి, భీమవరం

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

ఆకివీడు: స్థానిక సబ్ స్టేషన్ పరిధిలో మరమ్మతుల దృష్ట్యా ఈ నెల 22వ తేదీ ఉదయం 8 నుంచి 12 గంటల వరకూ విద్యుత్ సరఫరా నిలుపుదల చేయనున్నట్లు ఈఈ ఎస్.వెంకటేశ్వరరావు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. స్థానిక మాదివాడ, టౌన్, ఇండస్ట్రియల్ డీపీ, అగ్రహారం, సమతానగర్, అయిభీమవరం, అజ్జమూరు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండదన్నారు. ఆక్వా లైన్లకు కూడా సరఫరా నిలుపుదల చేస్తున్నట్లు తెలిపారు. విద్యుత్ వినియోగదారులు సహకరించాలని కోరారు.

24న ప్రత్యేక సమావేశం

కాళ్ల: మండలంలోని ఎల్ఎన్ పురం గ్రామ పంచాయతీ ఉపసర్పంచ్ అవిశ్వాస తీర్మానంపై 24న ప్రత్యేక సమావేశం నిర్వహించనున్నట్లు పంచాయతీ కార్యదర్శి కె.కమల బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రస్తుత ఉపసర్పంచ్ మైలా శ్రీనివాస్‌పై అవిశ్వాస తీర్మానం కోరుతూ పలువురు వార్డు మెంబర్లు భీమవరం ఆర్డీవో ప్రవీణ్ కుమార్‌రెడ్డికి ఇచ్చిన ఫారం-4 పై శనివారం ఉదయం 11.30 గంటలకు ఎల్ఎన్ పురం గ్రామ పంచాయతీ కార్యాలయంలో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేశామని ఆమె స్పష్టం చేశారు.

నేడు బీఎస్పీ బహుజన సంకల్ప సభ

భీమవరం: పట్టణంలోని వీరమ్మచెరువు పార్క్ వద్ద డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ భవనంలో బహుజన సంకల్ప సభ నిర్వహిస్తున్నట్లు బహుజన్ సమాజ్ పార్టీ రాష్ట్ర కార్యదర్శి మురాల రత్నరాజు చెప్పారు. గురువారం ఉదయం 10 గంటలకు నిర్వహించే సభకు బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడు బందెల గౌతమ్ కుమార్, జిల్లా అధ్యక్షుడు కొల్లాబత్తుల ఏలియారాజు హాజరవుతారని రత్నరాజు తెలిపారు.

24, 25న సీపీఎం జిల్లా విస్తృత సమావేశాలు

భీమవరం: సీపీఎం జిల్లా విస్తృత సమావేశాలు ఈ నెల 24, 25 తేదీల్లో నరసాపురంలో నిర్వహిస్తున్నట్లు ఆ పార్టీ జిల్లా కార్యదర్శి జేఎన్‌వీ గోపాలన్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సమావేశాల్లో పార్టీ రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు, రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు బి.బలరాం, మంతెన సీతారాం పాల్గొంటారన్నారు.

వ్యక్తి అదృశ్యం

భీమవరం: ఒకటో పట్టణంలోని నర్సయ్య అగ్రహారానికి చెందిన కె.దుర్గారావు (22) ఆచూకీ ఈ నెల 4 నుంచి తెలియరాలేదని అతడి సోదరుడు నాగరాజు బుధవారం ఫిర్యాదు చేశారని పోలీసులు తెలిపారు. వేరే వ్యక్తితో గొడవల కారణంగా ఎటో వెళ్లిపోయినట్లు భావిస్తున్నామని ఫిర్యాదులో పేర్కొనగా ఎస్సై ఎస్‌వీవీఎస్ కృష్ణాజీ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారన్నారు.

కాలభైరవునికి ప్రత్యేక పూజలు



పూజలు నిర్వహిస్తున్న అర్చకులు

ఆకివీడు: మహా శివుడి ప్రత్యేక రూపాల్లో ఒకటైన కాలభైరవస్వామి ఆశీస్సులు లభిస్తే సుఖ సంతోషాలు లభిస్తాయని వైఎస్సార్‌సీపీ మండల కమిటీ అధ్యక్షుడు నంద్యాల సీతారామయ్య అన్నారు. స్థానిక రాజరాజేశ్వరి సహిత మార్కండేయ స్వామి ఆలయ ప్రాంగణంలో కాలభైరవ విగ్రహ ప్రతిష్ఠ సందర్భంగా బుధవారం ప్రత్యేక పూజలు చేశారు. గురువారం ఉదయం 8.30 నిమిషాలకు స్వామి విగ్రహ ప్రతిష్ఠ నిర్వహిస్తామని నంద్యాల సీతారామయ్య తెలిపారు.

మాజీ సీఎం జగన్‌పై అనుచిత వ్యాఖ్యలు తగదు



సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా సోషల్ మీడియా అధ్యక్షుడు పూర్ణ

కాళ్ల: రాష్ట్రంలో పేద బడుగు బలహీన వర్గాల ఆశాజ్యోతి మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి గురించిఇ చులకనగా మాట్లాడినా, దుర్భాషలాడినా సహించేది లేదని వైఎస్సార్‌సీపీ జిల్లా సోషల్ మీడియా విభాగం అధ్యక్షుడు బంధన పూర్ణచంద్రరావు హెచ్చరించారు. కాళ్ల మండలం పెదఅమిరం పార్టీ క్యాంపు కార్యాలయంలో బుధవారం విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఆయన మాట్లాడుతూ మాజీ ముఖ్యమంత్రి వైఎస్సార్‌సీపీ వ్యవస్థాపకుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పేరు చెప్పగానే రాష్ట్రంలో అనేక మంది పేద ప్రజలు తమ ఆశాజ్యోతిగా గర్వంగా పిలుచుకుంటారన్నారు. అటువంటి మహా వ్యక్తిని జిల్లాలో ఒక మంత్రి బాధ్యత మరిచి దుర్భాషలాడటం బాధాకరమన్నారు. మంత్రి బాధ్యత లేకుండా మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిపై చేసిన వ్యాఖ్యలకు ప్రజలు ముక్కున వేలేసుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఆయన మాట్లాడిన తీరు చాలా బాధాకరమన్నారు. మంత్రి రామానాయుడు పబ్లిసిటీ కోసం ఏమైనా చేస్తారని, ఏమైనా మాట్లాడుతారని ఎద్దేవా చేశారు. మంత్రి ఆయన బాధ్యతను నిర్వర్తించి ప్రజలకు మేలు చేయాలని కోరారు. మాజీ ముఖ్యమంత్రిని ఒక మంత్రి చులకనగా మాట్లాడటం మంచి పద్ధతి కాదని హెచ్చరించారు. భవిష్యత్తులో మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిపై లేనిపోని ఆరోపణలు చేస్తే ఊరుకోమని ప్రతిఘటిస్తామని తెలిపారు. భీమవరం పట్టణ పార్టీ అధ్యక్షుడు గాదిరాజు రామరాజు మాట్లాడుతూ నిమ్మల రామానాయుడు మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిపై చేసిన వ్యాఖ్యలను తీవ్రంగా ఖండించారు. ఆయన మాట్లాడిన పదజాలం చాలా అభ్యంతరకరంగా ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. ఆయన నియోజకవర్గంలో ఏం చేస్తున్నారో అందరికీ తెలుసునని రాజకీయ నాయకులను బెదిరించటం అరెస్టులు చేయించడం వంటి పనులు చేస్తూ ప్రతిపక్ష పార్టీ నాయకులను ఇబ్బందులకు గురి చేస్తున్నారన్నారు. ఇదంతా ప్రజలు గమనిస్తున్నారని, భవిష్యత్‌లో ప్రజలే వారికి తగిన బుద్ధి చెబుతారని ఇకనైనా మంచి మనసుతో పేదలకు ఇచ్చిన హామీలు నెరవేర్చాలని హితవు పలికారు.

ప్రాంతీయ ఆసుపత్రి సేవలు భేష్



భీమవరం ఏరియా ఆసుపత్రిలో రోగులతో మాట్లాడుతున్న అజయ్ జైన్

భీమవరం (ప్రకాశంచౌక్): అంగన్‌వాడీ చిన్నారులకు విద్యాబుద్ధులు నేర్పించడంపై మరింత శ్రద్ధ చూపాలని, చౌక డిపోల ద్వారా పేదలకు నిత్యావసర వస్తువులు సకాలంలో అందించాలని రాష్ట్ర పర్యాటక, గృహ నిర్మాణ శాఖల ప్రత్యేక ముఖ్య కార్యదర్శి అజయ్ జైన్ అన్నారు. బుధవారం పశ్చిమగోదావరి జిల్లా పర్యటనలో అజయ్ జైన్ భీమవరం పట్టణంలో సుడిగాలి పర్యటన చేశారు. ఈ సందర్భంగా ప్రాంతీయ ఆసుపత్రి, గునుపూడి ఇందిరా గాంధీ పురపాలక సంఘం ప్రత్యేక ప్రాథమిక పాఠశాలలో నిర్వహిస్తున్న అంగన్‌వాడీ కేంద్రం, నాచువారి సెంటర్‌లో ప్రభుత్వ చౌక డిపో దుకాణాన్ని అజయ్ జైన్, జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి, జాయింట్ కలెక్టర్ టి.రాహుల్ కుమార్ రెడ్డి సంయుక్తంగా క్షేత్ర స్థాయిలో సందర్శించారు. తొలుత ప్రభుత్వ ఆసుపత్రిని సందర్శించి ఓపీలో రిజిస్టర్లను పరిశీలించారు. వైద్య సేవలను అందిస్తున్న అన్ని వార్డులను క్షుణ్ణంగా పరిశీలించారు. రోగులకు అందుతున్న సేవలు, మౌలిక సదుపాయాల గురించి అడిగి తెలుసుకొని సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ప్రత్యేక ముఖ్య కార్యదర్శి అజయ్ జైన్ మాట్లాడుతూ ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలు క్షేత్రస్థాయిలో ఏ విధంగా అమలు జరుగుతున్నాయో పరిశీలించడానికి ప్రభుత్వం ప్రతి రెండు, మూడు జిల్లాలకు ఒక సీనియర్ ఐఏఎస్ అధికారిని నియమించిందని, దీనిలో భాగంగా ఉమ్మడి తూర్పు, పశ్చిమ గోదావరి జిల్లాలకు తాను ప్రత్యేక అధికారిగా పర్యటిస్తున్నానని తెలిపారు. అలాగే అంగన్‌వాడీ కేంద్రాన్ని పరిశీలించి, పలు సూచనలు చేశారు. అనంతరం నాచువారి సెంటర్‌లోని ప్రభుత్వ చౌక డిపో నంబర్ 18ని పరిశీలించారు. ఈ పర్యటనలో జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి, ఎమ్మెల్యే పులపర్తి రామాంజనేయులు, జిల్లా జాయింట్ కలెక్టర్ టి.రాహుల్ కుమార్‌రెడ్డి, ఆర్డీవో కె.ప్రవీణ్ కుమార్‌రెడ్డి, జిల్లా స్త్రీ శిశు సంక్షేమ శాఖ అధికారి బి.సుజాతారాణి, డ్వామా పీడీ డాక్టర్ కేసీహెచ్ అప్పారావు, జిల్లా టూరిజం అధికారి ఏవీ అప్పారావు, జిల్లా గృహ నిర్మాణ శాఖ ఇన్‌చార్జి పీడీ జి.పిచ్చియ్య, ఈఈ బి.వెంకటరమణ, డీఎస్‌వో ఎన్.సరోజ, తహసీల్దార్ రావి రాంబాబు, పలు శాఖల అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

తాళ్లకోడు.. సమస్యల గోడు

ఆకివీడు: పేదల కోసం ఏర్పాటు చేసిన తాళ్లకోడులోని లబ్ధిదారుల సమస్యలు చాలా ఉన్నాయని వాటి పరిష్కారానికి ప్రభుత్వం దృష్టికి తీసుకెళతానని ప్రభుత్వ ముఖ్య కార్యదర్శి అజయ్ జైన్ వెల్లడించారు. మండలంలోని కుప్పనపూడి శివారు తాళ్లకోడులోని 74 ఎకరాల జగనన్న కాలనీలో మౌలిక వసతులు కల్పించాలి. కాలనీలో 3250 మందికి ఇళ్ల స్థలాలు ఇచ్చారని, వాటిలో 950 మంది ఇళ్లు నిర్మించుకున్నారని, వారికి మౌలిక వసతులు కల్పించాలని సూచించినట్లు విలేకరులకు తెలిపారు. కాలనీలో మంచినీరు, రోడ్లు, వీధిలైట్లు, డ్రెయినేజీ సౌకర్యం కల్పించాలని లబ్ధిదారులు అజయ్ జైన్ దృష్టికి తీసుకెళ్లారు. వారితోపాటు సమస్యలను సీపీఎం నాయకులు బీవీ వర్మ, డోకల లక్ష్మి, పెంకి అప్పారావు, కూటమి నాయకుడు ముత్యాల రత్నం తెలియజేశారు.

రంగు మారిన నీరు సరఫరా



నీటి సరఫరాకు ఉపయోగిస్తున్న ట్యాంకర్



మున్సిపాలిటీ సరఫరా చేసిన రంగు మారిన నీరు

భీమవరం (ప్రకాశం చౌక్): మున్సిపాలిటీ సప్లై చేస్తున్న మంచినీరు రంగు మారి ఉంటుందని తాగడానికి ఉపయోగపడట్లేదని పలు వార్డుల ప్రజలు వాపోతున్నారు. హెడ్ వాటర్ వర్క్స్ నుంచి భీమవరం పట్టణంలో ట్యాంకులను నీటిలో నింపి మంచినీరు అందని ప్రాంతాలకు ట్యాంకర్ల ద్వారా నీటిని సరఫరా చేస్తున్నారు. అయితే ఈ నీళ్లు పసుపు రంగులో ఉంటున్నాయని దుర్వాసనలు వస్తున్నాయని ప్రజలు చెబుతున్నారు. రంగు మారిన నీళ్లు సరఫరా చేస్తున్న మున్సిపల్ అధికారులు పట్టించుకోవడం లేదని ఆ నీరు తాగితే రోగాల పాలవుతామని ఆందోళన చెందుతున్నారు. తాజాగా భీమవరం నాలుగో వార్డు క్యాబిన్ రోడ్‌లో బుధవారం ట్యాంకర్ ద్వారా రంగు మారిన నీటిని సరఫరా స్థానికులు ఆందోళన వ్యక్తం చేశారు. ఫిల్టర్ చేయకుండా నీటిని నేరుగా సరఫరా చేస్తున్నారని అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి శుభ్రం చేసిన రక్షిత మంచి నీటిని సరఫరా చేయాలని ప్రజలు కోరుతున్నారు.

విద్యుత్ లైన్‌మెన్లు కావలెను

- బదిలీల్లో ఆకివీడు వద్దంటున్న సిబ్బంది
- 50 శాతం లైన్‌మెన్ పోస్టుల ఖాళీ
- నెలకు రూ.ఆరు కోట్ల ఆదాయం
- సరిపడే సిబ్బంది లేక ఆదాయానికి గండి



ఆకివీడు సబ్ స్టేషన్

ఆకివీడు: విద్యుత్ శాఖకు, ప్రభుత్వానికి అధిక ఆదాయాన్ని సమకూరుస్తున్న ఆకివీడు ప్రాంత విద్యుత్ వినియోగదారులకు సేవలందించేందుకు సరిపడా సిబ్బంది లేక నిత్యం ఇబ్బందులతో కాలం గడుపుతున్నారు. దుక్కి వర్షం కురిసినా, ఒక మోస్తరు ఈదురు గాలి వీచినా ఐదు గంటలకు పైగా విద్యుత్ సరఫరా నిలిచిపోతుంది. వినియోగదారులు లబోదిబోమంటూ విద్యుత్ శాఖ అధికారులకు ఫోన్లు చేసినా ఫలితం ఉండటం లేదు. మండల, పట్టణ పరిధిలో 33,100కు పైగా విద్యుత్ సర్వీసులున్నాయి. 2088 ట్రాన్స్‌ఫార్మర్లు, ఐదు విద్యుత్ సబ్ స్టేషన్లు ఉన్నాయి. వీటి మెయింటెనెన్స్‌కు, వినియోగదారుల విద్యుత్ సరఫరాలో ఇబ్బందులను తొలగించేందుకు 35 మంది లైన్‌మెన్లు, జూనియర్ లైన్‌మెన్లు, సహాయ లైన్‌మెన్లు, ఇద్దరు లైన్ ఇన్‌స్పెక్టర్లు పని చేయాలి. మండల పరిధిలోని విద్యుత్ శాఖకు సుమారుగా రూ.ఆరు కోట్లకు పైగా ఆదాయం వస్తుంది. మరింత ఆదాయం పెరగాల్సి ఉండగా సరిపడా సిబ్బంది లేక గండి పడుతోంది. ప్రస్తుతం ఆయా సబ్ స్టేషన్ల పరిధిలో కేవలం 50 శాతం కంటే ఎక్కువగా సిబ్బంది కొరత ఉంది. అర్బన్, రూరల్ ప్రాంతాల్లో మొత్తం 16 మంది లైన్‌మెన్లు మాత్రమే ఉన్నారు. సిబ్బంది కొరతతో విద్యుత్ సరఫరాకు తీవ్ర ఇబ్బంది ఏర్పడుతోంది. ప్రతి రోజూ ఎక్కడో ఒక చోట ట్రాన్స్‌ఫార్మర్ మరమ్మతులకు గురి కావడం, విద్యుత్ తీగలు తెగిపడటం, ఏబీ స్విచ్‌లు కాలిపోవడం వంటివి అధికంగా జరుగుతున్నాయి. మెయింటెనెన్స్ లోపంతో విద్యుత్ సమస్యలు మండలంలో తారా స్థాయికి చేరుకున్నాయి. పలుచోట్ల ఓవర్ లోడుతో ట్రాన్స్‌ఫార్మర్లు కాలిపోవడం, పేలిపోవడం వంటివి జరుగుతున్నాయి.

పట్టణంలోమరీ ఇబ్బంది

స్థానిక నగర పంచాయతీ పరిధిలో విద్యుత్ సరఫరాలో తీవ్ర ఆటంకం ఎదురవుతుంది. ప్రతి రోజూ ఏదో ఒక ప్రాంతంలో సరఫరా నిలిచిపోతుంది. పట్టణంలో 19 మంది లైన్‌మెన్లకు 10 మంది పని చేస్తుండగా వారిలో 4 లైన్‌మెన్లు సబ్‌స్టేషన్‌లో షిఫ్టు పనులు నిర్వహిస్తున్నారు. మిగిలిన ఆరుగురిలో ఇద్దరు అయిభీమవరం, చెరుకుమిల్లి, మరో ఇద్దరు కుప్పనపూడి, అజ్జమూరులో పని చేస్తుండగా టౌన్ పరిధిలో ఇద్దరు లైన్‌మెన్లు, ఎల్ఐ మాత్రమే పని చేయడంతో తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయని వినియోగదారులు వాపోతున్నారు.

ప్రైవేట్ లైన్‌మెన్ల వినియోగం

ప్రభుత్వ లైన్‌మెన్లుత లేక ప్రైవేట్ లైన్ మెన్లను చేపలు, రొయ్యల చెరువుల వద్ద వినియోగించుకోవలసి వస్తుందని యజమానులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. లక్షల్లో విద్యుత్ బిల్లులు చెల్లిస్తున్నప్పటికీ తమకు విద్యుత్ సరఫరా నిలిచిపోతే పని చేసే లైన్‌మెన్లు లేకపోవడం దారుణమని వారు వాపోతున్నారు. ఇతర పరిశ్రమల్లో కూడా ఇదే పరిస్థితి నెలకొంది. విద్యుత్ సరఫరా నిలిచిపోతే ప్రభుత్వానికి కొంత సొమ్ము ఆదా అవుతుందనే ఉద్దేశ్యంతో లైన్‌మెన్ల నియామకం జరగడం లేదని పలువురు ఆరోపిస్తున్నారు.

బదిలీలు లీలలేనా?

ఈ నెలలో బదిలీల పర్వం ఉండగా విద్యుత్ శాఖలోని లైన్‌మెన్ల బదిలీలు కూడా లీలలేనా అని పలువురు ఎద్దేవా చేస్తున్నారు. ఆకివీడు ప్రాంతానికి బదిలీపై రావడానికి కొంతమంది లైన్‌మెన్లు ఆసక్తి చూపడం లేదని తెలిసింది. ఈ నెలలో జరుగనున్న బదిలీల్లో అయినా లైన్‌మెన్ల కొరత తీరుతుందో లేదో వేచి చూడాల్సిందే.

దివ్యాంగుడిని తొలగించడం దారుణం



ఆచంటలో మాట్లాడుతున్న రాష్ట్ర నాయకుడు చిట్టిబాబు

పెనుగొండ: 90 శాతం వికలాంగత్వం ఉంటే దివ్యాంగులు ఉద్యోగాలకు పనికిరారనడం దారుణమని, ఆచంట ఉన్నత పాఠశాలలో దివ్యాంగ వాచ్‌మెన్ చదలవాడ ముత్యాలరావును తొలగించడం దారుణమని వికలాంగుల హక్కుల పోరాట సమితి రాష్ట్ర నాయకుడు బత్తిని చిట్టిబాబు ఆవేదన వ్యక్తం చేశారు. బుధవారం ఆచంట పెదపేటలో నిర్వహించిన స్నేహ భారతి వికలాంగుల సంక్షేమ సంఘ సమావేశంలో ఆయన మాట్లాడారు. చదలవాడను తొలగించిన నోటీసును హైకోర్టు రద్దు చేసినా, అప్పటి నుంచి విధుల్లోకి తీసుకోకపోవడం దారుణమన్నారు. తొలగింపులో సంబంధం లేదని ఎంఈవో అంటూనే, కమిటీ పరిశీలన చేసి తొలగించారంటూ తప్పుడు ప్రకటన ఇచ్చారన్నారు. తక్షణం ఆరోపణలు రుజువు చేయాలని లేదంటే న్యాయస్థానాన్ని ఆశ్రయిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో కాండ్రేకుల రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

వీకెండ్ మంత్రి గారూ.. మీ స్థాయి తెలుసా?

యలమంచిలి: వీకెండ్ మంత్రి నిమ్మల రామానాయుడు మాజీ ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి స్థాయి వ్యక్తిని విమర్శించే ముందు తన స్థాయి ఏమిటో తెలుసుకుని మాట్లాడాలని వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ ఉచ్చుల స్టాలిన్‌బాబు హితవు పలికారు. ఉన్న మాటంటే ఉలుకెక్కువనే చందాన ఎన్నికల సమయంలో రామానాయుడు పల్లవించిన మాటలనే వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఉటంకిస్తే రామానాయుడికి చిర్రెత్తుకొచ్చిందని స్టాలిన్‌బాబు విమర్శించారు. మీ చంద్రబాబు ఇచ్చిన సూపర్ సిక్స్ హామీలు ఏడాది కాలంలో ఎన్ని అమలు చేశారో మీ విజ్ఞతకే వదులుతున్నామన్నారు. హామీలు తుంగలో తొక్కిన మీకు జగన్‌మోహన్‌రెడ్డిని విమర్శించే అర్హత ఉందా అని స్టాలిన్‌బాబు ప్రశ్నించారు.

కంటి ఆస్పత్రితో ఆధిపత్య పోరు

పాలకొల్లు సెంట్రల్: పట్టణంలో సేవా సంస్థ పేరుతో నడుస్తున్న ఆ కంటి ఆసుపత్రికి నలత చేసినట్లుంది. గత 20 రోజులుగా ఆ సంస్థలో ఆధిపత్యపోరు నడుస్తుందని పట్టణ ప్రజల్లో తీవ్ర చర్చ నడుస్తుంది. సామాజిక వర్గాలుగా విడిపోయే ప్రమాదం కనిపిస్తుందని ఈ ఆసుపత్రి సంస్థ పెద్దలు సందేహంలో పడినట్లు సమాచారం. అసలు విషయానికి వస్తే ఆ ఆసుపత్రి సభ్యులు సుమారు 135 మంది వరకూ ఉన్నారు. గత కొంతకాలం క్రితం ఆ ఆసుపత్రికి కొందరు పెద్దలు ఓ పెద్దాయనను చైర్మన్‌గా నియమించినట్లు చెబుతుంటారు. అయితే ఆ సంస్థలో పని చేసే సిబ్బంది తొలగింపుతో వివాదం రాజుకుంది. చైర్మన్ తీరుపై ఇతర సభ్యులు ప్రశ్నించే సరికి ఆగ్రహించిన ఆయన రాజీనామా లేఖ ఇచ్చారు. అయితే ఆయన సామాజిక వర్గానికి చెందిన మరో 20 మంది సభ్యులు రాజీనామా చేసేందుకు నిర్ణయం తీసుకోవడంతో సమస్య మరింత ముదిరింది. అయితే సంస్థ అబాసుపాలు కాకూడదనే ఉద్దేశంతో తిరిగి ఆయనే చైర్మన్‌గా ఉండాలని నిర్ణయం తీసుకోవడంతో ఆయనే కొనసాగుతున్నారు. ఇప్పటికైనా సదరు చైర్మన్ గారి తీరు మారుతుందో? లేదో? వేచి చూడాలని సంస్థ సభ్యులు పేర్కొంటున్నారు.